www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
06 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 278

# విశాల భారతి

తెలుగు దినపత్రిక







# కన్ఫ్యూజన్‌లో కాంగ్రెస్

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కొత్త ట్విస్టులు చోటు

### బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటన.. బీజేపీ అభ్యర్థి ఖరారు

### కాంగ్రెస్‌లో కీలక పరిణామం.. ఊహించని ట్విస్ట్ తెర మీదకు

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కొత్త ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను తమ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించింది. అటు బీజేపీ అభ్యర్థి ఖరారు కోసం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రముఖ సినీ నటి బీజేపీ నుంచి బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సమయంలోనే కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అభ్యర్థి ఖరారు పైన మంత్రుల కమిటీ ముగ్గురు పేర్లు సూచించింది. అయితే, ఢిల్లీలో మారుతున్న లెక్కల మేరకు అభ్యర్థి ఖరారు వేళ ఊహించని ట్విస్ట్ తెర మీదకు వచ్చింది.**

- విశాలభారతి, స్టేట్ బ్యూరో

జూబ్లీహిల్స్ లో గెలుపు ఇప్పుడు కాంగ్రెస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇతర పార్టీల కంటే ముందుగానే ఇక్కడ గెలుపు కోసం ముగ్గురు మంత్రులతో కమిటీ... పలువురు నేతలతో ప్రచారం కోసం ఏర్పాట్లు చేసారు. ఎంఐఎం సహకారం పైన అంతర్గతంగా సమీక్షలు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ సీటు నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అజాహరుద్దీన్ తిరిగి పోటీ చేయాలని భావించారు. కాగా.. అజాహరుద్దీన్ ను ఎమ్మెల్సీగా పంపి.. ఇక్కడ నుంచి బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ ఆలోచనగా తెలుస్తోంది. తాజాగా ముగ్గురు మంత్రులు సైతం నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, కార్పోరేటర్ సీఎన్ రెడ్డి పేర్లు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. సీటు కోసం ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేసారు. ఇక..అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ఎంపిక చేయటంతో..

మిగతా 2లో..



## చార్జీల పెంపుతో

# ప్రజలు ఆగం

## సిటీ బస్సులు ఛార్జీలు పెంపు



### రూ.10 పెంచాలని నిర్ణయం
### మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం
### దుర్మార్గమైన నిర్ణయం
### పేద ప్రజలకు భారం
### రేవంత్ రెడ్డి పన్నిన కుట్ర

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో సిటీ బస్సు కనీస ఛార్జీని ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా రూ.10 పెంచాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. పండుగ సమయంలో తీసుకున్న దుర్మార్గమైన నిర్ణయంగా అభివర్ణించారు. పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్ర అని కేటీఆర్ విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో తెలంగాణ ప్రజలు అల్లాడుతున్న సమయంలో బస్సు ఛార్జీల పెంపు వారి నెత్తిన పిడుగులాంటిదని కేటీఆర్ అన్నారు. ప్రతి నిత్య ప్రయాణికుడిపై నెలకు కనీసం రూ.500 అదనపు భారం పడుతుందని.. బడుగుజీవులు, దినసరి కూలీలు ఆర్టీసీ ఛార్జీల పెంపుతో ఎలా బతకాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు, టీ24 టిక్కెట్ ఛార్జీలును పెంచింది చాలదన్నట్టు, రెగ్యూలర్ ఛార్జీపై ఏమాత్రం కనికరం లేకుండా 50 శాతం ధరలను పెంచడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్థ, అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ మండిపడ్డారు. రాజధాని హైదరాబాద్ వాసుల నడ్డివిరిచేలా ప్రతి నిత్యం దాదాపు కోటి రూపాయల భారాన్ని ప్రజలపై మోపాలని చూస్తున్న రేవంత్రెడ్డి జంట నగరాల ప్రజలపై కక్ష పెంచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జంటనగరాల్లో కాంగ్రెస్ ని ప్రజలు పూర్తిగా తిరస్కరించారనే కసితోనే రేవంత్ రెడ్డి ప్రతీకార చర్యలకు దిగుతున్నారని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉచిత బస్సు పథకంతో రాష్ట్ర ఆర్టీసీ

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం



### బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
### తెలంగాణ పలు జిల్లాల్లో వర్షాలు
### హైదరాబాద్‌లో రెండోరోజు వర్షం
### లోతట్టు ప్రాంతాలు జలమయం
### ఆదివారం ఉదయం భారీ వర్షం
### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో పలు జిల్లాల్లో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో వరుసగా రెండోరోజు వర్షం దంచికొడుతోంది. శనివారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, ఆదివారం

మిగతా 2లో..



## ఎన్నికల్లో బుద్ధి చెప్తాం

మాజీ ఎంపీ బీబీ పాటిల్ 02



## దానం రాజీనామా ఉత్తదే!

02

# రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి

## తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే రక్ష

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
### రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్ శ్రద్ధ
### బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు
### ఎన్నికల ప్రక్రియపై ఉత్కంఠ
### కాంగ్రెస్ మోస చరిత్ర కలిగిన పార్టీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే రక్షకుడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల కేసీఆర్ చూపుతున్న కట్టుబాటు ఇతర ఏ నాయకుడిలో కనిపించదని ఆయన పేర్కొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండలంలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హరీశ్ రావు వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా జడ్పీ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతోందని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రతి చోట గులాబీ జెండా ఎగురుతుందని అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఎంపీటీసీ ,

మిగతా 2లో..

# నేడే బీసీ రిజర్వేషన్లపై విచారణ

## టీ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట

### బీసీ రిజర్వేషన్ల అంశం.. సుప్రీంకోర్టులో విచారణ
### బలమైన వాదనలు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెడీ
### చాలా సీరియస్‌గా ప్రభుత్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

టీ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టారు. నేడు సోమవారం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరగబోతోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లబోతున్నారు. హస్తినలో సీనియర్ న్యాయవాదులను కలవబోతున్నారు. న్యాయపరమైన అంశాలపై సలహాలు, సూచనలు తీసుకోబోతున్నారు కాంగ్రెస్ నేతలు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేలా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెడీ అయింది. ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం.

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి.. తెలంగాణ ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే జీవో ఇవ్వడం, అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం, ఆర్డినెన్స్ తీసుకు రావడం వంటి పరిణామాలు జరిగాయి. స్థానిక సంస్థలకు సంబంధించి జీవో నెంబర్ 9 కూడా ఇవ్వడం జరిగింది. 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ కేసులు వేశారు. దీనిపై రేపు వాదనలు వింటామని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ క్రమంలో దీనిపై అఫిడవిట్ దాఖలు చేసి బలమైన వాదనలు వినిపించాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఇవాళ సుప్రీంకోర్టులో తమ వాదనలను బలంగా వినిపించాలనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టారు. సుప్రీంకోర్టులో వాదనలకు సంబంధించి

మిగతా 2లో..



**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగిన సంగతి తెలిసిందే. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం జారీ చేసిన జీవోను పలువురు కోర్టుల్లో సవాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో అక్టోబర్ 8వ తేదీన తదుపరి విచారణ జరగనుంది. ఇదిలాఉండగానే, తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వంగా గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయడం చట్ట విరుద్ధమని గోపాల్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.**



02

# స్థానిక ఎన్నికలపై ఈసీ గైడ్‌లైన్స్

### స్థానిక సంస్థల ఎన్నికలు ప్రక్రియ ఊపందుకుంది
### 5 దశల్లో స్థానిక ఎన్నికలు షెడ్యూల్ విడుదల చేశారు
### మార్గదర్శకాలు జారీ
### రేషన్ డీలర్లు కూడా పోటీ

# స్థానిక ఎన్నికలపై ఈసీ గైడ్‌లైన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5 దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముదిని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నందున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది.



**రేషన్ డీలర్లు కూడా పోటీ చేయవచ్చు...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవర్గంలో అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి.

**పోటీ చేసేందుకు వీరు అనర్హులు...**

మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడిన వారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు.

**అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితి ఎంత...**

స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది. అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్టంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి.


అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

**అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలి...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరీని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్) అయితే రూ.5 వేలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి. ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్).. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250.. సర్పంచ్ అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000.. వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి. ముఖ్యంగా అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్స్ తీసుకుని ఉండాలి.

# తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే రక్ష

**( మొదటిపేజీ తరువాయి )**



జడ్పీటీసీ స్థానాలన్నీ గెలిచి బీఆర్ఎస్ శక్తిని మరోసారి నిరూపించుకుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ మోస చరిత్ర కలిగిన పార్టీ, బీజేపీ ద్రోహ చరిత్ర గల పార్టీ. రెండు పార్టీలూ తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో ఎప్పుడూ వెనుకాడలేదు. ఎన్నికల ముందు పెద్ద హామీలు ఇచ్చి, తరువాత మర్చిపోవడం వీటి అలవాటు అంటూ మండిపడ్డరు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించిన రాష్ట్రానికి కనీస కృతజ్ఞత చూపకపోవడం బీజేపీ తీరని విమర్శించారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసినప్పుడు తెలంగాణకు ఒక్కటీ ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని చెప్పారు.

హరీశ్ రావు మాట్లాడుతూ.. నల్లధనం తెచ్చి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానన్న ప్రధాని మోదీ హామీ ఏమైంది? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానం ఎక్కడ? పేదలందరికీ ఇల్లు, బుల్లెట్ ట్రైన్‌లు అన్నవి ఎక్కడ? అంటూ ప్రశ్నలు లేవనెత్తారు. రూ.350 ఉన్న ఎల్పీజీ సిలిండర్‌ను రూ.1,200కు, రూ.65 ఉన్న పెట్రోల్ ధరను రూ.100 దాటించినది బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. 2017లో అమలు చేసిన జీఎస్టీ కారణంగా ప్రజలు ఉపయోగించే ప్రతి వస్తువు ధర పెరిగిందని, బీజేపీ ఎన్నికల ముందు ధరలు తగ్గించి, ఎన్నికల తర్వాత పెంచే నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు.

తెలంగాణకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్షగా నిలుస్తున్నారని అన్నారు. కేసీఆర్ తెలంగాణే తన ప్రాణమని భావించారు. ఎవరికైనా కష్టం వస్తే ఊరుకోరు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేస్తున్నాడు. యూరియా కొరతతో రైతులు ఇంతవరకు చూడని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తెలంగాణ రైతులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ చిన్నచూపు చూస్తున్నాయి అని హరీశ్ రావు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలందరూ కష్టపడి ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించాలి. తెలంగాణ రైతు, విద్యార్థి, కూలీ ప్రతి ఒక్కరి భవిష్యత్తు బీఆర్ఎస్ పాలనలోనే సురక్షితం. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత రాజకీయాలకు ప్రజలు సరైన బుద్ధి చెబుతారు అని పిలుపునిచ్చారు.

# దానం రాజీనామా ఉత్తదే!

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే రాజీనామా**
**న్యూస్ నెట్టింట తెగ హల్ చల్**
**సోషల్ మీడియాలో పుకార్లు**
**నాగేందర్ సన్నిహితులకు ఫోన్లు**
**నాగేందర్ స్వయంగా రంగంలోకి**
**రూమర్స్ వ్యాప్తి చెందిస్తున్నారు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రాజకీయాల్లో ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేస్తున్నారనే వార్త ఆదివారం ఉదయం నుంచి నెట్టింట తెగ హల్ చల్ చేసింది. దీంతో పొలిటికల్ సర్కిల్స్ లలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. సమావేశం ఏర్పాటు చేసి మరీ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన పదవికి రాజీనామా చేస్తున్నారని విపరీతంగా వార్తలు వైరల్ అయ్యాయి. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్ఎస్‌ల మధ్య విపరీతంగా సోషల్ మీడియాల వేదికగా పుకార్లు వ్యాపించాయి.

దీనిపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సన్నిహితులు కూడా ఆయనకు ఫోన్ లు చేసి మరీ దీనిపై క్లారిటీ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇక లాభంలేదని దీనిపై రియాక్ట్ అయితేనే.. వీటికి బ్రేకులు పడతాయని ఆయన సన్నిహితులు చెప్పడంతో దానం నాగేందర్ స్వయంగా రంగంలోకి దిగారు. తనపై ఉదయం నుంచి వస్తున్న రాజీనామా పుకార్లపై క్లారిటీ ఇచ్చారు. తానంటే నచ్చని వారు, ప్రజల మధ్య లేని కాంట్రవర్సీ, అపోహాలు క్రియేట్ చేయాలనుకునే వారు ఈ విధంగా రూమర్స్ వ్యాప్తి చెందిస్తున్నారని, తాను రాజీనామా చేస్తున్నాననే పుకార్లలో అసలు నిజంలేదన్నారు.

తనకు అలాంటి ఆలోచన లేదని.. తన వ్యతిరేకులే అలాంటి ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. దానం నాగేందర్ .. ఖైతరాబాద్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి.. జూబ్లిహిల్స్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన హైకమాండ్ ను కూడా సంప్రదించారని చెప్పుకున్నారు. కానీ ఈ ప్రతిపాదనకు.. కాంగ్రెస్ హైకమాండ్ అంగీకరించలేదు. కానీ హఠాత్తుగా ఆయన రాజీనామా చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల కంటే .. దానం నాగేందర్ పరిస్థితి భిన్నం. మిగతా వారంతా తాము పార్టీ మారలేదని చెప్పుకున్నారు. ఆ మేరకు విచారణకు కూడా హాజరయ్యారు. కానీ దానం నాగేందర్ కు అలా చెప్పుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆయన కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేశారు కూడా. గెలిచి ఉంటే రాజీనామా చేసి ఉండేవారు కానీ ఓడిపోయారు కాబట్టి ఇప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నారు. మిగతా అందరి ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హతా పిటిషన్లను స్పీకర్ తిరస్కరించవచ్చు కానీ.. దానం నాగేందర్ విషయంలో మాత్రం స్పీకర్ అలా చేయడం కష్టం. అలాగని దానంపై అనర్హతా వేటు వేయలేరు. అలాంటి పరిస్థితి వస్తే రాజీనామా చేయిస్తారు. అందుకే రాజీనామా పుకార్లు వస్తున్నాయి. జూబ్లిహిల్స్ టిక్కెట్ ఇస్తే ఆయన రాజీనామా చేయడానికి రెడీనే. కానీ హైకమాండ్ మాత్రం ఆ చాయిస్ ఇవ్వడం లేదు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

**( మొదటిపేజీ తరువాయి )**

ఉదయం నుంచి హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తోంది. వర్షంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

**వర్షంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్...**

జీహెచ్ఎంసీ పరిధిలోని పలు చోట్ల ఉదయం నుంచి వర్షం పడుతోంది. ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, జూబ్లీహిల్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పెన్షన్ ఆఫీస్, అబీడ్స్, యూసఫ్‌గూడ, మణికొండ సహా పలు ప్రాంతాల్లో ఆదివారం భారీగా వర్షం కురుస్తోంది. ఖాళీగా ఉండాల్సిన హైదరాబాద్ రోడ్లు వర్షం కారణంగా ఆదివారం ట్రాఫిక్ తో నిండిపోయాయి. జీహెచ్ఎంసీ అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ టీమ్స్ అప్రమత్తం అయ్యాయి. నీళ్లు నిలిచిపోతున్న చోట్ల క్లియర్ చేస్తున్నారు. పటాన్ చెరు, ఆర్సి పురం, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్ పల్లి, గాజులరామారం, నిజాంపేట్, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సుచిత్ర, అల్వాల్, మల్కాజిగిరి, కాప్రా, బొల్లారం, రాజేంద్రనగర్, బాలాపూర్, చాంద్రాయణగుట్ట, మీర్‌పేట్, ఎల్‌బీ నగర్, చార్మినార్, బహదూర్‌పురా, కిషన్‌బాగ్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోందని.. పరిస్థితిని బట్టి బయటకు వెళ్లడంపై ప్లాన్ చేసుకోవాలని



తెలంగాణ వెదర్ మ్యాన్ సూచించారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో బయటకు వెళ్లడం అంత క్షేమదాయకం కాదని పేర్కొన్నారు.

**పలు జిల్లాల్లో భారీ వర్షా లతో ఎల్లో అలర్ట్ జారీ...**

క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో హైదరాబాద్‌తో పాటు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో అత్యవసరమైతే తప్పా ఇండ్ల నుంచి ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రంగారెడ్డి, వికారాబాద్‌లో భారీ వర్షం కురుస్తోంది. దాంతో మూసీ నదికి వరద క్రమంగా పెరుగుతోంది. దీని ప్రభావం హైదరాబాద్, జీహెచ్ఎంసీ ప్రాంతాలపై పడనుంది. మూసీ నుంచి నీటిని విడుదల చేస్తే హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాలను వరద నీరు ముంచెత్తనుంది. వర్షాలతో వికారాబాద్ జిల్లాలో కోటిపల్లి ప్రాజెక్టు అలుగు పారుతోంది.

## స్థానిక ఎన్నికలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

**తొర్రూరు, విశాలభారత:**



స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ఇప్పించడం కాదు,ఏ ఆటంకం లేకుండా సజావుగా ఎన్నికలు జరిపి ఫలితాలు వెల్లడించి ఎన్నికైన ప్రజాప్రతినిధులను వారి వారి పదవుల్లో కూర్చోబెట్టడంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సామాజికవేత్త,సాహితీవేత్త దొనికెన కుమారస్వామి డిమాండ్ చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు ఎనలేని మేలు చేసేది మేమేనని గొప్పలు చెప్పుకుంటున్నారని,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం కోర్టు పరిశీలనలో ఉండగా తన ఇష్టారాజ్యంగా రిజర్వేషన్లను నిర్ణయించి ఎలక్షన్ కమీషన్ తో ఎన్నికల షెడ్యూలును ప్రభుత్వం విడుదల చేయించిందన్నారు. రిజర్వేషన్ల కేటాయింపుపై ఎవరూ కోర్టుకు వెళ్ళకపోయినా, ప్రభుత్వమే ఎవరితోనైనా కేసు వేయించి స్థానిక ఎన్నికలను వాయిదా వేయించాలనుకున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్ వివిధ బిల్లులు రాష్ట్రపతి,గవర్నర్ల వద్ద పెండింగ్ లో ఉందన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా ఫలితాలు తమకు ప్రతికూలంగా రావొచ్చని, అప్పుడు ప్రభుత్వ యంత్రాంగంలో ముసలం పుట్టి సీఎం కుర్చీకే ఎసరు రావచ్చని ఫలితంగా ప్రభుత్వ మనుగడకు ముప్పు కలగవచ్చని భావించి ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం భయపడుతున్నదని దొనికెన ఎద్దేవాచేశారు.

స్థానిక సంస్థలకు పాలక మండల్లు లేకపోవడం వలన దాదాపు పద్దెనిమిది మాసాలుగా నిధులు రాక అభివృద్ధి కుంటుపడిందని అంతేకాకుండా స్థానిక సంస్థల కనీస అవసరాలు కూడా తీర్చలేని ప్రత్యేక పాలనాధికారుల బాధలను చూసైనా ధైర్యం చేసి ప్రభుత్వం సరియైన నిర్ణయం తీసుకొని వెంటనే ఎన్నికలు నిర్వహించి, స్థానిక సంస్థలను ఆదుకోవాలని దొనికెన కుమారస్వామి ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# ఎన్నికల్లో బుద్ధి చెప్తాం

**మాజీ ఎంపీ బీబీ పాటిల్**
**అలయ్ బలయ్ కార్యక్రమం**
**ఎన్.రామచందర్ రావు**
**బీజేపీలో చేరిన చంటి ప్రభు**
**రాబోయే ఎన్నికల్లో గెలిపించాలి**
**రైతులను ఆదుకోలేదు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ నేతృత్వంలో ఆందోల్ మండలం సంగుపేట వద్ద ఓ ఫంక్షన్ హాల్లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత చంటి ప్రభుతోపాటు చంటి దేవిక బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడారు.. రాష్ట్రంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని రామచందర్ రావు కోరారు. వర్షాలతో పంట నష్టం వాటిల్లితే రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వెయ్యలేదని ఆరోపించారు. రైతులను ఆదుకోలేదని విమర్శించారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అమలు కానీ హామీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమైందని తెలిపారు. ప్రకృతి వనాలు, స్మశానవాటికలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని రామచందర్ రావు ఆరోపించారు. గత పది సంవత్సరాల్లో ఉన్నదంతా బీఆర్ఎస్ దోచుకుంటే మిగిలింది ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటుందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై రాజకీయం చేస్తోందని ఫైర్ అయ్యారు. బీసీల సంక్షేమాన్ని చూడడం లేదని మండిపడ్డారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించింది ప్రధాని నరేంద్ర మోదీ అని చెప్పుకొచ్చారు. బిల్లులు రాక బీఆర్ఎస్ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే తీరు కొనసాగుతోందని విమర్శించారు. ఏ హక్కుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఓటు అడుగుతున్నారో ప్రజలకు చెప్పాలని బీజేపీ చీఫ్ రామచందర్ రావు ధ్వజమెత్తారు.

అలాగే గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుండి వచ్చిన నిధులను మళ్లించాయని, ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో నిధులు లేక కేంద్ర నిధుల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హయాంలో గ్రామీణ తెలంగాణ ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని అన్నారు. 'సడక్ యోజన' కింద రోడ్లు, 'వనమహోత్సవానికి' నర్సరీల ఏర్పాటు, గ్రామ గ్రామాన నిర్మించిన స్మశాన వాటికలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు అందించిందని ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంకా గ్రామీణ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందించిన సంక్షేమాన్ని, నిధులను ప్రజలకు అర్థమయ్యే విధంగా మన ప్రజా ప్రతినిధులు వివరించాలని రామచందర్ రావు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం బీజేపీకి అత్యంత కీలకమైనదిగా మారింది.



## చార్జీల పెంపుతో ప్రజలు ఆగం

**( మొదటిపేజీ తరువాయి )**

సంస్థను దివాళా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూస్తోందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వలన రాష్ట్ర ప్రగతి రథచక్రాలే కాదు, చివరికి ఆర్టీసీ ప్రగతి రథచక్రాలు సైతం ధ్వంసం చేసిన పాపం సీఎం రేవంత్ రెడ్డితో పాటు, కాంగ్రెస్ సర్కారును కుప్పకూల్చే వరకూ వెంటాడుతుందని హెచ్చరించారు. ఫ్రీ బస్సు పథకంతో ఆర్టీసీ నీ ఆగం చేసిండు..

# నేడే బీసీ రిజర్వేషన్లపై విచారణ

**( మొదటిపేజీ తరువాయి )**

సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరపాలని నిర్ణయించారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడానికి కారణాలేంటి అనేది న్యాయవాదులకు వివరించి, వారి ద్వారా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని కాంగ్రెస్ నేతలు ఆలోచన చేస్తున్నారు. గతంలో బిహార్‌లో రిజర్వేషన్ల పెంపుదలను సుప్రీంకోర్టు కొట్టివేసిన దాఖలాలు ఉన్నాయి. గతంలో సుప్రీంకోర్టే 50 శాతం క్యాప్ విధించింది కాబట్టి.. క్యాప్‌ను అధిగమించి తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం అనగా అక్టోబర్ 6న వాదనలు వింటామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వంగా గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్‌లో ప్రతివాదులుగా తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని చేర్చారు. ఈ పిటిషన్ సోమవారంఅక్టోబర్ 6 రోజున విచారణకు రానుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే తెలంగాణలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల కాగా... బీసీ రిజర్వేషన్ల అంశం ఇటు హైకోర్టు, అటు సుప్రీంకోర్టులో విచారణ జరగనుండం ఉత్కంఠగా మారింది.



# కన్ఫ్యూజన్‌లో కాంగ్రెస్

**( మొదటిపేజీ తరువాయి )**

నవీన్ యాదవ్ కు టికెట్ ఖాయమన్న ప్రచారం జరిగింది. తన కొడుకు రాజ్యసభ సభ్యుడైతే ఏంటి.. తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అంజన్ కుమార్ యాదవ్ చెబుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు సికింద్రాబాదు ఎంపీ అభ్యర్థిగా ప్రయత్నాలు చేసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పూర్తిగా సీఎం రేవంత్ పైనే ఆశలు పెట్టుకున్నారు. మంత్రుల కమిటీ సైతం రామ్మోహన్ పేరును తమ జాబితాలో సిఫారసు చేసారు. కాగా.. ఇప్పుడు మైనంపల్లి హనుమంతరావు రేసులోకి వచ్చారు. దీంతో.. కాంగ్రెస్ నాయకత్వం అభ్యర్థి ఖరారు విషయంలో తర్జన భర్జన పడుతోంది. పార్టీ రాష్ట్ర నేతలు స్థానిక సంస్థలతో పాటుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పైన వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి పైన ఢిల్లీ కేంద్రంగా కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. ఎంఐఎం అధినేత అసద్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సైతం కాంగ్రెస్ కు అనుకూలం గా ఉన్నాయి. బీఆర్ఎస్ మాగంటి కుటుంబానికే సీటు ఇవ్వటం.. బీజేపీ నుంచి సినీ నటి జయసుధ పేరు రేసులోకి రావటంతో ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు పార్టీ నేతల సమాచారం. ఇదే సమయంలో ఎమ్మెల్సీ పదవి పైన ఉన్న న్యాయపరమైన చిక్కులతో తాను మండలికి వెళ్లటం సాధ్యమేనా అనే సందేహంతో అజాహరుద్దీన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన మద్దతు దారులు సైతం జూబ్లీహిల్స్ నుంచే పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.

# రింగురోడ్డుపై వరుసగా ఆరు కార్లు ఢీ



- భారీగా ట్రాఫిక్ జాం
- క్లియర్ చేసిన ట్రాఫిక్ పోలీసులు

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ఔటర్ రింగ్ రోడ్డుపై వరుసగా ఆరు ఢీకొన్నాయి. తృటిలో పెను ప్రమాదం తప్పిన ఈ ఘటనలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం హిమాసాగర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ వైపు నుంచి ఓ కారు గచ్చిబౌలి వైపు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తుంది. ఇది ఇలా ఉండగా ఏమైనా సాగర్ సమీపంలో కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేశాడు. దీంతో వెనకాల నుంచి వస్తున్న మరో ఐదు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఎయిర్ బెలూన్స్ తెలుసుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు పోలీసులు తెలియజేశారు. ఆరు కార్లు వరుసగా ఢీకొన్న ఘటనతో ఔటర్ రింగ్ రోడ్డుపై సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాలను క్లియర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు ఎర్రబెల్లికి లేదు

**తొర్రూరు, విశాలభారతి:**




సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు ఎర్రబెల్లికి లేదు అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. మనవరాలి వయస్సు ఉన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉషలు విమర్శించారు.తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.... గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.దళితులకు సీఎం చేయలేదని,దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, రేషన్ కార్డు ఇవ్వలేదని,రుణమాఫీ చేయలేదని,డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదని కేజీ టు పీజీ వరకు విద్య అందించలేదని విమర్శించారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి మంత్రిగా అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని,అభివృద్ధి పనుల్లో కమిషన్లు తీసుకొని అభివృద్ధి చేయకుండా వదిలేశాడని,గత ప్రభుత్వంలో మహిళలను పట్టించుకోలేదని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు స్థానిక ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిందని, ఉచిత బస్సు ప్రయాణం, గృహ లక్ష్మీ పథకం ద్వారా 200 ఉచిత విద్యుత్, అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పాఠశాలల నిర్వహణ, పెట్రోల్ బంకు నిర్వహణ,ఆర్టీసీలో 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా నడుపుతూ ఒక్క బస్సుకు నెలకు రూ. 69 వేల ఆదాయం వస్తుందని, వడ్డీ లేని రుణాలు అందిస్తుందని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. 10 ఏళ్లలో చేయని అభివృద్ధి కేవలం రెండేళ్లలో రేవంత్ రెడ్డి చేశాడని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే కనీస నైతిక హక్కు ఎర్రబెల్లికి లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, తాళ్లపల్లి బిక్షం గౌడ్,దొంగరి శంకర్, ముద్దసాని సురేష్,కిషన్ యాదవ్, వెలుగు మహేశ్వరి,బసనబోయిన మహేష్ యాదవ్,గండు అండమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వినోద్

**తొర్రూరు, విశాలభారతి:**



యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తొర్రూరు పట్టణానికి చెందిన బసన బోయిన వినోద్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని జహీరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన రాష్ట్ర,జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం

**దేవరుప్పల, విశాలభారతి:**

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలనుసారం దేవరుప్పుల మండలం, పెద్దమదూరు గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికల బరిలోకి దిగాలనుకునే ఆశావహుల పేర్లను సేకరించిన గ్రామ బిఆర్ఎస్ శ్రేణులు.ఈ సందర్భంగా బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కచ్చితంగా మనదే విజయం అని,ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని,పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని,ఎన్నికల్లో పాల్గొనాలని ఉత్సాహంగా ఉన్న వారి పేర్లను నోట్ చేసుకొని అధిష్టానంతో చర్చించి త్వరలో ఎంపిటిసి అభ్యర్థిని నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు,పాల్గొన్నారు.

# రత్నాకర్ రావును పరామర్శించిన భూ పోరాట కమిటీ



**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు కి ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకున్న భూ పోరాట కమిటీ నాయకులు ఈరోజు బండ్లగూడలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి కాలనీ భూ పోరాట కమిటీ అధ్యక్షులు అందోజు రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మండల కార్యవర్గ సభ్యులు చిర్ర శేఖర్, ధూపం నిరంజన్, నాగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హరీశ్ రావును కలిసిన జక్కిడి రఘువీర్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్ విశాలభారతి:**

ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో ఈరోజు సిద్దిపేట శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీశ్ రావుని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి , హరీశ్ రావు ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తపేటలో ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, వేగవంతంగా పూర్తి చేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమం లో మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, అంబర్పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,, మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ సర్పంచ్ బరిలో పెద్ది కృష్ణమూర్తి



**దేవరుప్పల, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం చట్టపరమైన వివాదానికి దారితీసింది.ఇదే సమయంలో రిజర్వేషన్లపై హైకోర్టులో కూడా ఇప్పటికే విచారణ జరుగుతోంది.రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా చూపుతూ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగానికి విరుద్ధమని పిటిషన్ పేర్కొంది.ఈ నెల 8న హైకోర్టు ఈ అంశంపై తీర్పు ఇవ్వనుంది.హైకోర్టు తీర్పు తర్వాత సుప్రీంకోర్టు విచారణకు దిశా నిర్దేశం అవుతుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుంటే *దేవరుప్పుల గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పెద్ది వర్గం కోరిక మేరకు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ బరిలో దిగుతారని ఆ వర్గం నాయకులు తెలిపారు. అదేవిదంగా పెద్ది వర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా దేవరుప్పుల ఎంపీటీసీ బరిలో చిలుకూరు నర్సయ్య,తోటకూరి రమేష్ పోటీపడుతున్నారు.ఇద్దరిలో ఒకరిని తొమ్మిదో తేదీన ప్రకటిస్తామని పెద్ది కృష్ణమూర్తి గౌడ్ తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్ కుట్ర

**సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షు సుర్వి యాదయ్య గౌడ్**

**చౌటుప్పల్, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయంలో వార్డు మెంబర్ సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలను బూచిగా చూపెడుతూ జాప్యం చేస్తూ అమలుగాని రిజర్వేషన్లను ఆశ చూపి బీసీల నెత్తిన శఠగోపం పెట్టి హైకోర్టు సుప్రీంకోర్టులో కేసులు పెట్టిస్తూ ఆశావహులను తెలంగాణ ప్రజలను వంచిస్తూ మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారంగా ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎందుకంటే హైకోర్టులో, సుప్రీంకోర్టులో ప్రజావాజ్యాలు కేసులు వేయడం జరిగింది.కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది తోటి కేసులు వేయించి తెలంగాణ ప్రజలను నయవంచన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలు లేకుండా కుట్రబుద్ధితోటి కుతంత్రాల తోటి ఆడుతున్న నాటకం ప్రజలంతా గమనించాలి. ఈ కుట్ర కుతంత్రాల కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది నిజంగా కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీల రిజర్వేషన్ చట్టబద్ధత చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తున్నారు.

# మద్యం మత్తులో యువకుడి హంగామా

**రెంట్ పోల్ ఎక్కి హల్ చల్**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



ఓ యువకుడు నానా రభస సృష్టించాడు. మద్యం మత్తులో కరెంట్ సంభం ఎక్కి హంగామా చేశాడు. ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వాంబే కాలనీకి చెందిన వేణుగోపాల్ (30) తరచూ మద్యం తాగుతూ భార్యతో గొడవ పడేవాడు. తన ఫ్రెండుకు ఆయన రూ.1500 లు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు వేణుగోపాల్ కు ఇవ్వడానికి ఇబ్బంది పెడుతున్నాడు. ఆ డబ్బులు కావాలని వేణుగోపాల్ ను భార్య ఈరోజు అడిగింది. అయితే వేణుగోపాల్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మద్యం మత్తు లోనే పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు. పోలీసులు వేరే పనుల్లో బిజీగా ఉండడంతో కొద్దిసేపు ఆగాలని సూచించారు. పోలీసులు తనను పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ మద్యం మత్తులో ఉన్న వేణుగోపాల్ వెంటనే పి ఎస్ ముందు ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం పైకి కిందికి దూకి చనిపోతాను అంటూ నానా హంగామా చేశాడు. వెంటనే అప్రమత్తం అయిన పోలీసులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి కరెంటు సరఫరా నిలిపివేశారు. వేణుగోపాలు సముదాయించి పోలీసులు కిందికి దించారు. దీనితో కథ సుఖాంతమైంది.

# నేటి నుండి ప్రజావాణి రద్దు

**స్థానిక ఎన్నికల కోడ్ అమలు సందర్భంగా**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లాలో స్థానిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిటిసి, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**వాజేడు, విశాలభారతి:**

ములుగు జిల్లా వాజేడు మండల బిజెపి గిరిజన మోర్చా ఆ అధ్యక్షులు, వాజేడు సొసైటీ డైరెక్టర్ కుర్సం కృష్ణమూర్తి ఆదివారం ఉదయం ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది కాంగ్రెస్ పార్టీలో చేరిన కురుసం కృష్ణమూర్తికి కాంగ్రెస్ పండగ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌరారం సర్వేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దాట్ల సీతారామరాజు, నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు, యాదవ సంఘం ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ నాయకులు నల్లగాసి రమేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాకర్లపూడి కళ్యాణ్, యాదవ్ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు అనుముల సంజీవ్ యాదవ్, నారెడ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రానికి చెందిన గద్దం గణేష్ (36) తన అక్క వద్ద ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఉంటూ గతంలో ఉస్మానియా ఆసుపత్రిలో ప్రయివేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా అతను కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి ఇబ్రహీంపట్నం మున్సిపల్ లోని బైపాస్ రోడ్డు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అధికారుల సమన్వయం లేక ప్రజలకు ఇబ్బందులు

**జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పల నర్సింహ్మా రెడ్డి**

**ఎల్బీనగర్, విశాలభారతి :**

మన్సూరాబాద్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో తలెత్తిన తీవ్రమైన సమస్యలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. GHMC, ఇరిగేషన్, హైడ్రా, HMWS&SB వంటి శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల చెరువు పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు శాఖల అధికారుల పై మండిపడ్డారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పైన ఉన్న వనస్థలిపురం పరిసర దాదాపు 500 కాలనీల నుండి వచ్చే వర్షపు నీరు పెద్ద చెరువును నింపుతున్నప్పటికీ, అసంపూర్తిగా నిలిచిపోయిన బాక్స్ నాలా పనులు మరియు FTL స్థలంపై కోర్టు కేసు క్లియరెన్స్ లేకపోవడం వలన చెరువులో మురుగునీరు కలిసిపోతూ పర్యావరణానికి హాని కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార శాఖల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, “ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించిన ఇలాంటి చెరువుల అభివృద్ధి పనులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండడం అశోభనీయమైన విషయం అని వ్యాఖ్యానించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, కోర్టు క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేసి, నిలిచిపోయిన బాక్స్ నాలా పనులు వెంటనే ప్రారంభించాలి అని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు ప్రాధాన్యంగా తీసుకోవాలని పలు శాఖల అధికారులకు సూచించారు. GHMC, ఇరిగేషన్, హైడ్రా, HMWS&SB శాఖలు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని చెరువులు మన జీవనాధారాలని వాటి పరిరక్షణలో ఆలస్యం అంటే ప్రజల జీవనంపై ముప్పని ఆయన పేర్కొన్నారు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ను కల్పించాలంటూ లేఖ

**చౌటుప్పల్, విశాలభారతి:**



బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడానికి పరిశీలించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన డాక్టర్ చినుకని శివప్రసాద్ సహస్ర ఫౌండేషన్ చైర్మన్ సహస్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చినుకాని శివప్రసాద్ తెలంగాణ ప్రభుత్వం బీసీలకు కల్పించినటువంటి 42శాతం రిజర్వేషన్ను కొనసాగించడాన్ని పరిశీలించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం జరిగినది. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడానికి ఒక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి దాని నివేదిక ఆధారంగా బీసీలకు 56శాతం నిర్ణయించారు. దానికి అనుగుణంగా రాజ్యాంగ ప్రకారం బీసీలకు సరిపడేలా 42శాతం రిజర్వేషన్ రాజకీయంగా స్థానిక సంస్థల్లో కల్పించి వారి అభ్యున్నతికి దోదపడలని తమరి దృష్టికి తీసుకొస్తున్నామని లేఖలో పేర్కొనడం జరిగినది. అదేవిధంగా గౌరవ సుప్రీం కోర్టు ఇందిరా సహాని తీర్పు లో 50శాతం పరిమితి విధించినప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పరిమితి పెంచవచ్చని పేర్కొన్నారు.ఇట్టి విషయాన్ని తమరు ఆలోచించగలరని లేఖలో ప్రస్తావించారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



**కొడకండ్ల, విశాలభారతి:**

కొడకండ్ల మండలంలోని మొండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20012002 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా గతంలో సేవలందించిన ప్రధానోపాధ్యాయులు యాకూబ్ పాషా ఉపాధ్యాయులు ఉపేందర్ రావు చిత్ర ఆనంద్ దేవ వెంకన్న నగేష్ గోపి కిషన్ శ్రీనివాస్ విద్యాసాగర్ లను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అదేవిధంగా అత్యంత ఆత్మీయతతో రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు పనిచేస్తున్నప్పటికీ స్నేహమే సలాం చేసేలా ఆనాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగితేలారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ భాస్కర్ పవర్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని, తల్లిదండ్రులు ఈ సృష్టిని పరిచయం చేపిస్తే గురువులు సమాజాన్ని పరిచయం చేస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగానని దాదాపుగా 250 పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని అన్నారు. మిగతా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరినొకరు మురిసిపోతూ ఆనందం వ్యక్తం చేస్తూ ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య రెడ్డి నర్సింహా రేణుక ఉపేంద్ర ఉమారాణి ఉమా అమరావతి జాంబ గిరి మోహన్ వీరాస్వామి నరేష్ శ్యాం ప్రసాద్ హేమలత సరిత వాణి సిద్దు చందర్ రాజు రమేష్ శ్రీను నెహ్రూ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్
- ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్, విశాలభారతి:**



మండలం చిన్న కొండూరు గ్రామం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలను,సర్పంచు వార్డు సభ్యులను,ఐకమత్యంతో పార్టీ సభ్యులు గెలిపించాలని ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన పథకాలు ఎన్నో వేళ్ళా యని అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు అందరూ కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పేదలకు అందిస్తున్న సంక్షేమాలు మన పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మరియు బ్లాక్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,ఎన్నికల ఇన్చార్జిలు సామకూర రాజయ్య,ఊదరి నరసింహ,పాక చిరంజీవి,నల్ల నరేందర్ రెడ్డి,సత్తయ్య,వర్కాల రాము,గ్రామ శాఖ అధ్యక్షులు బక్క కిషన్,ప్రధాన కార్యదర్శి తీగుళ్ల బాలరాజు,వార్డు సభ్యులు చెక్క యాదయ్య,గడ్డం సత్తయ్య మాజీ సర్పంచ్ తీగల పెంటయ్య,బక్క శ్రీనాథ్,మాజీ ఉప సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య,మాజీ మార్కెట్ డైరెక్టర్ బక్క నరసింహ పార్టీ సీనియర్ నాయకులు దోర్నాల శ్రీనివాస్ వీరరాజు భాస్కరాచారి డొప్ప అంజయ్య,మల్లయ్య,సామి,ఉదర రమేష్ బత్తుల జంగయ్య,తీగుళ్ల ఇస్తారి,నరేష్,మండల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నెల్ల గణేష్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబు మరియు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# భారతీయులకు అంబేద్కర్ అందించిన వజ్రాయుధం ఓటు హక్కు

- బోడుప్పల్లో 346వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- రాజకీయ పార్టీలు నిరుపేదలకు, నిజాయితీపరులకు సీట్లు ఇవ్వాలి
- బడుగు, బలహీన వర్గాలు రాజకీయ రంగంలో రాణించాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య




**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 346వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించాలి. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ఆయా రిజర్వేషన్లను అనుసరిస్తూ నిరుపేదలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, అప్పుడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి చేసిన రిజర్వేషన్లకు న్యాయం జరుగుతుందని, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అదేవిధంగా అంబేద్కర్ కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని నిస్వార్థంగా ప్రజా సేవ చేసే నాయకులను మాత్రమే ఓటు వేయాలని, నేను రాజకీయమంటే ఒక వ్యాపారంలా చూస్తున్నా పార్టీలను, నాయకులను, పక్కన పెట్టాలని, రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీ గల నాయకులను ఎన్నుకోవడానికి మాత్రమే ఓటు హక్కును వినియోగించాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్య లక్ష్మీనారాయణ, రాపోలు శ్రీరాములు, బండారి సాయి, చిల్ల అంజయ్య, యేసు రాజు, సగ్గు నరసింహ, జడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన క్యామ మల్లేష్

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**



దసరా పండుగను పురస్కరించుకుని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్యామ మల్లేష్ , జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సమావేశంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ని కూడా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు, పండుగ సందర్భంలో సాదరంగా పరస్పర శుభాకాంక్షలు తెలుపుకుంటూ నాయకులు పరస్పరం స్నేహపూర్వకంగా పలకరించుకున్నారు.

# సర్పంచ్ బరిలో విద్యార్థి ఉద్యమ నేత

**మహబూబాబాద్, విశాలభారతి:**

పినిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఈసారి కొత్త ఉత్సాహం నెలకొంది. విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన యువ నాయకుడు సాయికుమార్ బరిలోకి దిగడంతో గ్రామ రాజకీయాల్లో చైతన్యం వచ్చింది. సాయికుమార్ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, గ్రామ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాడు. పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, వృద్ధులకు ఆహార పంపిణీ,పేద విద్యార్థులకు గురుకులాల్లో సీట్లు కల్పించడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మనసులు గెలుచుకున్నాడు. కరోనా సమయంలో బాధితులకు సహాయ సహకారాలు అందించారు. గ్రామ యువతలో సాయికుమార్‌కు విశేష ఆదరణ ఉంది. అభివృద్ధి, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం అనే మూడు సూత్రాలతో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఆయన సర్పంచ్ బరిలోకి దిగనున్నారు. ప్రజల సమస్యలను వినిపించి, వాటికి పరిష్కారం చూపడమే తన లక్ష్యమని సాయికుమార్ చెబుతున్నారు.



# విద్యుత్ షాక్‌తో రెండు బర్రెలు మృతి

**విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమని ఆరోపణ**

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పసుమాముల గ్రామంలో విద్యుత్ షాక్ కారణంగా రెండు బర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఎక్స్‌లెన్సియా కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక సన్నకారు రైతు సన్నీళ్ళ నర్సింహా ప్రతిరోజు మాదిరిగా తన బర్రెలను మేత కోసం తీసుకెళ్లగా, అప్రమత్తంగా వేలాడుతున్న విద్యుత్ వైర్‌ను తాకడంతో రెండు బర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.ఈ ఘటనపై బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, "విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని ఎన్నిసార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యమే నా బర్రెల ప్రాణాలు తీసింది" అని ఆరోపించారు. రెండు బర్రెల మృతి కారణంగా సుమారు రూ.2.5 లక్షల ఆర్థిక నష్టం వాటిల్లిందని తెలిపారు. జీవనాధారంగా ఉన్న బర్రెలను కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర నిరాశకు గురైంది. గ్రామస్థులు, బాధిత కుటుంబం కలిసి విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని, నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

- గాజులరామారం భవాని నగర్‌లో 41 లక్షలతో మంజూరు

**కుత్బుల్లాపూర్, విశాలభారతి:**



నియోజకవర్గం పరిధిలోని 125 డివిజన్ గాజుల రామారం భవాని నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఉదయం భవాని నగర్ లో పర్యటించి నూతన సిసి రోడ్డు పనులు పరిశీలించారు. అనంతరం బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ.. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన బస్తీ నుండి పట్టణాల వరకు రాష్ట్రం నలుమూలల అభివృద్ధి కనబడలానేదే మన ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మంత్రివర్యులు శ్రీ దుద్ధిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరువతో నియోజకవర్గం గణనియంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ వైపాండు , నర్సింగ్ రావు , మని కుమార్, చౌదరి మరియు శివరాం , మహేందర్, మధుకర్, సుబ్రహ్మణ్యం , పాండు , సత్యనారాయణ , రామ్ రెడ్డి జగదీష్ , కలీలు , బస్తివాసు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో అధ్యక్షుడికి సన్మానం

**ఆదిలాబాద్ ప్రతినిధి, విశాలభారతి:**

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సంద అశోక్‌ను ఘనంగా సన్మానించారు. అదిలాబాద్ లోని చిలుకూరి లక్ష్మి గార్డెన్‌లో పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగులకు అశోక్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలు టీఎన్జీవో సంఘానికి ఎప్పుడూ అవసరమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శివ కుమార్, తిరుమలరెడ్డి, సుమన్, సెక్రటరీ చంద్రశేఖర్, శ్రీహరి, రామ్మోహన్, వెలమ ప్రభాకర్, కుడాల రవి, శేఖర్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఎల్ఎండీ 6 గేట్లు ఎత్తివేత

- 18వేల క్యూసెక్కుల నీటి విడుదల

**తిమ్మాపూర్ విశాలభారతి:**

కరీంనగర్ పట్టణంలోని లోయర్ మానేడ్యాం 6 గేట్లను ఎత్తి 18వేల క్యూసెక్కుల నీటిని అధికారులు ఆదివారం విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి సుమారు 18 వేల క్యూసెక్కుల నీరు ఎల్ఎండీ కి రాడంతో 4 గేట్లను 2 ఫీట్ల మేర, మరో 2 గేట్లను ఒక ఫీట్ మేర ఎత్తి కాకతీయ కాల్వ ద్వారా దిగువకు 18,277 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎల్ఎండి 24.034 టీఎంసీలకు గాను 23.947 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ ప్రాంతంలోని రైతులు డ్యాం పరిసర ప్రాంతాలకు వెళ్ళకూడదని ముందస్తుగా అప్రమత్తం చేశారు.

**డ్యామ్ వద్ద పబ్లిక్ సందడి**

దసరా సెలవులు ఆదివారంతో ముగియడంతో డ్యాం అందాలను చూసేందుకు పబ్లిక్ రావడంతో డ్యాం పరిసరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా ప్రజలు డ్యాం అందాలను మొబైల్స్ లో బంధించుకుంటూ ఫొటోలు దిగుతూ మురిసిపోయారు. అధికారుల పైరవీతో డ్యాం గేట్ల వద్దకు వచ్చిన పబ్లిక్‌ను కంట్రోల్ చేసేందుకు సిబ్బంది నానా తంటాలు పడ్డారు.





# మక్క రైతులను ముంచుతున్న దళారులు

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

**నర్సంపేట, విశాలభారతి:**

మొక్కజొన్న రైతులను మధ్య దళారులు దోచుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను ఆదివారం సందర్శించారు. మొక్కజొన్నను అమ్మకానికి తీసురొచ్చిన రైతుల ఇబ్బందులు, ధరల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు సరైన మార్క్ఫెడ్ సౌకర్యం కల్పించకుండా దళారులు, వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నదని.. మద్దతు ధర క్వింటా రూ.2400 కు అమ్మాల్సిన మొక్కజొన్నలు రూ.1600 నుంచి 2100 దాటడం లేదన్నారు. అధిక వర్షాలతో దిగుబడి తగ్గి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతాంగానికి కనీస మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత పాలకులపై లేదా అని ప్రశ్నించారు. తక్షణమే కనీస మద్దతు ధర అమలయ్యేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి రాజేందర్, వీరన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సోయా' నూర్పిడికి వర్షం దెబ్బ

- అవస్థలు పడుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

**ముధోల్, విశాలభారతి:**

సోయా పంట నూర్పిడి పనులకు వర్షం దెబ్బ కొట్టింది. ముథోల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సోయా పంట దెబ్బతిన్నది. నాలుగైదు రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఉన్న కాస్త పంట నూర్పిడి పనులు చేపట్టగా.. ఆదివారం కురిసిన వర్షానికి పంటలు తడవగా కోత పనులు నిలిచిపోయాయి. సోయా పంటకు ప్రైవేట్‌లో రూ.4వేల లోపే ధర పలకడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసి గింజలను రోడ్డుపై ఆరబెట్టిన సమయంలోనే వర్షం రావడంతో తడిసినట్లు రైతులు తెలిపారు. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు ఇంటికి వచ్చేలా లేవని వాపోతున్నారు. సోయా పంట రంగు మారినా ధర తక్కువగా వస్తుందని రైతులు చెబుతున్నారు. దాదాపు సగం పంటల కోత పూర్తి కాగా మిగతా పనులు పూర్తయితే కనీసం చేతి ఖర్చులకైనా డబ్బులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. వరుణుడు కరుణిస్తేనే కాస్త పంటలు చేతికొస్తాయని, లేకుంటే పూర్తిగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉన్న కాస్త పంటకైనా మద్దతు ధర లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.